క్లుప్తంగా...

వారం రోజుల్లో తాగునీటి సమస్య పరిష్కారం


స్థానికులతో మాట్లాడుతున్న నివేదిత

రసూల్‌పురా: సిల్వర్ కాంపౌండ్ 'డబుల్' ఇళ్ల నివాసితుల తాగునీటి సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తామని నివేదిత హామీ ఇచ్చారు. ఆరు బ్లాకుల్లో 161 కుటుంబాలకు తాగునీటి వసతి కల్పించేందుకు నెలన్నర రోజుల క్రితం బోర్డు వాటర్‌వర్క్స్ అధికారులు ప్రతి బ్లాక్‌కు ఎనిమిది నల్లా కనెక్షన్లు ఇచ్చారు. తాగునీటిని విడుదల చేయకపోవడంతో ఆదివారం స్థానికులు తమ సమస్య పరిష్కరించాలని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న నివేదిత సోమవారం స్థానికులతో సమావేశమయ్యారు. బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌తో మాట్లాడామని వారం రోజుల్లో తాగునీటిని విడుదల చేస్తామని చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్. శ్రీనివాస్, నరేష్, డీ. శ్రీనివాస్, జిలానీ పాల్గొన్నారు.

వర్సిటీ కాంట్రాక్టు ఉద్యోగులపై వివక్ష తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు, ఉద్యోగులపై వివక్ష తగదని సంఘం నాయకులు డాక్టర్ పరుశురాములు, డాక్టర్ ధర్మతేజ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలోని ఇంటర్, డిగ్రీ, వృత్తి విద్యా కాలేజీలలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేసి కేవలం యూనివర్సిటీల అధ్యాపకులను పక్కన పెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వం స్పందించి వర్సిటీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు

బీఎస్‌పీకి మాదిగలు గుణపాఠం చెబుతారు


మాట్లాడుతున్న ఎంఎస్‌ఎఫ్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: సామాజిక న్యాయాన్ని విస్మరించి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతివ్వని బీఎస్‌పీకి తెలంగాణ మాదిగలు తగిన గుణపాఠం చెబుతారని ఎంఎస్‌ఎఫ్ జాతీయ నాయకులు పేర్కొన్నారు. సోమవారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షులు సోమశేఖర్‌మాదిగ, కార్యదర్శులు పల్లెర్ల సుధాకర్, మురళీకృష్ణ మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతు ప్రకటిస్తే బీఎస్పీతో కలిసి నడుస్తామని ఎమ్మార్పీఎస్ అధినేత మాయావతికి లేఖ రాసినా హైదరాబాద్‌లో జరిగిన సభలో వర్గీకరణ అంశాన్ని ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. దళితుల్లో మాదిగలు, ఉపకులాల ఓట్లు అడిగే నైతిక హక్కు బీఎస్‌పీకి లేదన్నారు. సమావేశంలో అజయ్ సామ్రాట్, నరేష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


సభ్యులను సన్మానించిన జి.సూర్యశంకర్‌రెడ్డి

సనత్‌నగర్: జెక్‌కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గంగాధర్ రావు ఏకగ్రీవంగా నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా ఉమామహేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా మల్లు ప్రసాద్, కోశాధికారిగా ఓసీఆర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా బాషా నియమితులయ్యారు. కొత్తగా ఎన్నికైన అసోసియేషన్ సభ్యులను జెక్‌కాలనీ ఫెడరేషన్ అధ్యక్షుడు జి.సూర్యశంకర్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. అలాగే సీనియర్ సిటిజన్స్ సంక్షేమం కోసం అసోసియేషన్‌కు రూ. లక్ష విరాళం అందజేశారు.

సమస్యల పరిష్కారానికి వినతి


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

అమీర్‌పేట: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు శిశు సంక్షేమ శాఖ అధికారులను కోరారు. యూనియన్ అధ్యక్షురాలు నల్లభారతి, వేదావతి సోమవారం అమీర్‌పేటలో మహిళా అభివృద్ధి శ్రీ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, కమిషనర్ భారతి హోళీ కేరిని కలిసి వినతి పత్రం ఇచ్చారు.

వైకుంఠధామం.. నేడు ప్రారంభోత్సవం

- ఎనిమిదిన్నర కోట్ల వ్యయంతో నిర్మాణం
- రాష్ట్రంలోనే మోడల్‌గా నిలవనున్న శ్మశానవాటిక
- మంత్రులు కేటీఆర్, తలసాని, మల్లారెడ్డి చేతుల మీదుగా ప్రారంభం



సనత్‌నగర్: బేగంపేట శ్యాంలాల్‌బిల్డింగ్స్ వద్ద రూ.8.54 కోట్ల నిర్మితమైన వైకుంఠధామం (ధనియాలగుట్ట శ్మశానవాటిక) మంగళవారం (నేడు) ప్రారంభం కానుంది. రాష్ట్ర మంత్రులు కేటీఆర్‌వు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారు. ఈ శ్మశానవాటికలో అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నిర్మాణం, సెరిమోనియల్ హాల్, చెక్కల నిల్వ గది, పిండ ప్రదానం చేసే ప్రాంతం, వెయిటింగ్ హాల్, బాడీ ప్లాట్‌ఫారంలు, ఫీచర్ గోడలు, ప్రవేశ, నిష్క్రమణ ద్వారాల వద్ద ఆకర్షణీయమైన ఆర్చీల నిర్మాణం, ఫలహారశాల, నీటి వసతి సహా టాయిలెట్ బ్లాక్‌ల ఏర్పాటు, పాత్‌వేస్ అభివృద్ధి, పార్కింగ్ ప్రాంతం, సీఎస్ఆర్ కింద శివుని విగ్రహం ఏర్పాటు, వైఫై సౌకర్యం, రెండు అంతిమయాత్ర వాహనాలను అందుబాటులో తీసుకువచ్చారు. ఆయా బ్లాక్‌లకు వైకుంఠధామం, ముక్తిధాం, దివ్యధాం వంటి పేర్లను ఏర్పాటు చేశారు.

ఏర్పాట్ల పర్యవేక్షణ..

వైకుంఠధామం ప్రారంభోత్సవ ఏర్పాట్లను కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, రాజయ్య, శేఖర్‌ముదిరాజ్, అఖిల్ అహ్మద్, నరేష్, రఘునాథ్ తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇక్కడివాసుల ఇబ్బందులను గమనించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు వారికి అండగా నిలిచారన్నారు. కొంతమంది ఇక్కడి స్థలం విషయంలో వ్యతిరేకించినా ముందుండి స్థలం కేటాయించేలా ఆయన చూపిన తెగువ మరువలేనిదన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ధనియాలగుట్ట శ్మశానవాటికను అభివృద్ధి చేశారన్నారు.

కదిలిన యంత్రాంగం .. సమస్య పరిష్కారం



సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్..


రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ధ్వంసమైన రోడ్డుకు మరమ్మతులు

లాలాపేట: తార్నాక డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి అసంపూర్తి పనులను స్థానికులు ఇక్కట్లు పడేవారు. లాలాపేట భజన సమాజం వెనకాల గతంలో పైపులైన్ పనుల కోసం రోడ్లు తవ్వి పనులు పూర్తయ్యాక వాటికి మరమ్మతులు చేయకుండా అలగే వదిలేశారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ఫలితం లేకపోయింది. ఈ సమస్యపై గత నెల 28న 'పైపులైన్లు వేశారు..రోడ్డు మరమ్మతులు విస్మరించారు' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. సోమవారం లాలాపేట భజన సమాజం వెనకాల రోడ్డు మరమ్మతలు చేయడంతో స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

మంత్రి ప్రొటోకాల్ పాటించకపోవడం తగదు

కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్

బన్సీలాల్‌పేట్: అధికారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించకుండా స్థానిక ప్రజాప్రతినిధికి కనీస గౌరవం ఇవ్వకుండా మాజీ కార్పొరేటర్‌తో కలిసి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ రాంగోపాల్‌పేట్‌లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కార్పొరేటర్ చీర సుచిత్రశ్రీకాంత్ ఆరోపించారు. పాన్‌బజార్‌లోని తన కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు శ్రీకాంత్, ప్రతాప్, ఎస్ఆర్ మల్లేష్‌లతో కలిసి ఆమె మాట్లాడారు. ఇటీవల నాలాలో పడి మరణించిన చిన్నారి మౌనిక కుటుంబానికి ఆర్థిక సాయం రూ.5 లక్షల ఇచ్చే సమయంలో స్థానిక కార్పొరేటర్ అయిన తనకు సమాచారం ఇవ్వకుండా మాజీ కార్పొరేటర్‌తో కలిసి సదరు కుటుంబానికి చెక్కు ఇవ్వడం అంటే ప్రజల ఓట్లతో ఎన్నికైన మహిళా ప్రజాప్రతినిధినైన తనను అవమానించడమే అవుతుందన్నారు. డివిజన్‌లో ప్రతి విషయాన్ని రాజకీయం చేస్తూ బీఆర్ఎస్ నాయకులు బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడుతూ ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తున్నారన్నారు.నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నామన్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ ఓటమిని జీర్ణించుకోక ప్రజల ఓట్లతో ప్రజాప్రతినిధిగా ఎన్నికైన తమను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలి


పోస్టుకార్డులు ప్రదర్శిస్తున్న వికాస్ మంచ్ ప్రతినిధులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని సివిలియన్ ప్రాంతాలను జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలని కంటోన్మెంట్ వికాస్ మంచ్ ఆధ్వర్యంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. అన్నానగర్ చౌరస్తాలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సోమవారం బస్తీ సంక్షేమ సంఘం నాయకులు మద్దేల యాదగిరి, కనకయ్య. మురళి, నరసింహా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంచ్ ప్రధాన కార్యదర్శి సంకీ రవిందర్ మాట్లాడుతూ.. అన్ని వార్డుల్లో ఈ పోస్టు కార్డు ఉద్యమం చేపట్టి 50 వేల మంది అభిప్రాయాలను సేకరించి పోస్టు కార్డులను ప్రధాన మంత్రి కార్యాలయానికి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచ్ ఆధ్యక్షులు ఏబెల్, ప్రతినిధులు ప్రభుగుప్త, ఫన్సీ, ఇటుక గోపి, అరుణ్‌యాదవ్, కృష్ణ ముదిరాజ్, ప్రవీణ్, హేమలత, మహేష్, చింతకాయల వెంకటేష్ పాల్గొన్నారు.

తలసీమియాపై అవగాహన అవసరం


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

గాంధీఆస్పత్రి: తలసీమియా వ్యాధిపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైద్య నిపుణులు సూచించారు. తలసీమియా సికిల్ సెల్ సొసైటీ (టీఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి పిడియాట్రిక్ సర్జరీ విభాగంలో సోమవారం ప్రపంచ తలసీమియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ పిడియాట్రిక్ సర్జరీ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ నాగార్జున, సికిల్‌సెల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు చంద్రకాంత్ అగర్వాల్, సుమన్ జైన్ మాట్లాడారు. తలసీమియా వ్యాధి వంశపారంపర్యంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తోందని, గాంధీ పిడియాట్రిక్ సర్జరీ విభాగంలో గత మూడేళ్లలో 40 మందికి స్ప్లెనెక్టమీ సర్జరీలు విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు. గాంధీ పిడియాట్రిక్ సర్జరీ విభాగంలో ఏర్పాటు చేసిన 'చిల్డ్రన్స్ ప్లే డెన్' చిన్నారులకు త్వరితగతిన స్వస్థత చేకూర్చేందుకు దోహదపడుతుందన్నారు. 'బీ అవేర్ షేర్ కేర్' నినాదంలో ఈ ఏడాది అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. తలసీమియా వ్యాధిగ్రస్తులకు గాంధీఆస్పత్రి అందిస్తున్న వైద్యసేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు శ్రీనివాస్, కవిమోజీ ఇలక్కియా, రాజ్‌కిరణ్, ఫణీంద్ర, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


స్థానికులతో మాట్లాడుతున్న శ్రీ గణేష్

రసూల్‌పురా: మన కంటోన్మెంట్-మన అభివృద్ధి నినాదంతో కంటోన్మెంట్ నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్ తెలిపారు. సోమవారం ఏడో వార్డు ఓల్డ్ గాంధీనగర్, ఎనిమిదో వార్డు బొల్లారం బ్యాంక్ కాలనీలో ఆయన పర్యటించగా తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, బోర్‌వెల్ వీధి దీపాలు, బ్యాంక్ కాలనీలో పేద మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళ సాధికారికత కోసం శ్రీ గణేష్ ఫౌండేషన్ తరఫున బ్యాంక్ కాలనీలో కుట్టు శిక్షణ కేంద్రం, కుట్టు నేర్పించేందుకు ట్రైనర్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గాంధీనగర్‌లో ప్రతిరోజు చెత్త చెదారం తొలగించాలని బోర్డు దఫేదార్ చిరంజీవికి సూచించారు. ఇక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను బోర్డు సీఈవో మధుకర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో సుజాత, కిశోర్, చోటు ముఖేష్, సుశీల బ్యాంక్ కాలనీ స్థానికులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పథకాలపై ఇంటింట ప్రచారం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చిలకలగూడ: బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ సీతాఫల్‌మండి ఉప్పరి బస్తీలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ సీనియర్ నాయకుడు గరికపోగుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 50 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు అభివృద్ధి పనులను ఏడేళ్లలో పూర్తిచేసిన ఘనత పద్మారావుకే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చంద్రశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మీ, రేవతి, గగనకుమారి, సంగీత, సరోజని, మణిమంజరి, శ్వేత, ప్రవల్లిక, పద్మ, అర్చన, నవీన్, రాజేష్, జయశ్రీ, మారేపల్లి రవి పాల్గొన్నారు.

వర్సిటీల అభివృద్ధికి సీఎం కృషి



ఓయూలో మాట్లాడుతున్న పద్మారావుగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: వర్సిటీల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఓయూ ఉద్యోగులు ఏర్పాటు చేసిన ఈద్- మిలాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, యూజీసీ డీన్ మల్లేష్, టీఎన్‌జీవో అధ్యక్షులు రాజేందర్, ఎన్‌జీవోస్ అధ్యక్షులు జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

ముస్లిం ఉద్యోగులు లేకున్నా ఈద్ మిలాపా?

ఓయూలో ముస్లిం ఉద్యోగులు లేకున్నా ఈద్-మిలాప్ జరపడం తగదని పలువురు ఉద్యోగులు పేర్కొన్నారు. గతంలో ముస్లిం ఉద్యోగులు సుమారు 400 వరకు ఉండేవారని వారి కోసం ప్రతి ఏటా ఆనవాయితీగా ఈద్ మిలాప్ జరిపేవారని ఉద్యోగ విరమణలు నియామకాలు జరపనందున ప్రస్తుతం ముస్లిం ఉద్యోగులు 30 మంది కూడా లేరన్నారు. పండుగ పేరుతో రాజకీయం చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టి ముస్లిం రిజర్వేషన్లను పాటించాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్..

వ్యక్తి అదృశ్యం


సాయి

అడ్డగుట్ట: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. ఈస్ట్ మారేడుపల్లిలోని మొండిబండ నగర్‌కు చెందిన శివరాళ్ల సాయి(30) ఈ నెల 7న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి రాత్రైనా రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తెలిసినా ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కోలుకుంటున్న మాధవి

భర్త గంగాధర్‌పై మిస్సింగ్ కేసు


చికిత్స పొందుతున్న మాధవి


అదృశ్యమైన గంగాధర్

గాంధీఆస్పత్రి : గాంధీ ఆస్పత్రిలో చావుబతుకులతో కొట్టుమిట్టులాడుతున్న మాధవి క్రమక్రమంగా కోలుకుంటుంది. కాన్పు కోసం వచ్చి ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న భార్య, ఆరేళ్ల కుమారుడిని గాంధీలోనే వదిలేసిన గంగాధర్ అదృశ్యమైన ఘటనకు సంబంధించి 'ఐసీయులో తల్లి.. ఆకలితో చిన్నారి, అనే శీర్షికతో సాక్షి కథనం ప్రచురించిన సంగతి విదితమే. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం సలూరా గ్రామానికి చెందిన మాధవి కాన్పు కోసం గాంధీలో చేరగా ఆమె వెంట భర్త గంగాధర్, కుమారుడు సాత్విక్ వచ్చారు. ఆడశిశువు పుట్టి చనిపోవడంతో మాధవి అపస్మారకస్థితికి వెళ్లి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతుండగా గంగాధర్ ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. వైద్య చికిత్సల తర్వాత కోలుకున్న మాధవి ఫోన్ నంబర్లు చెప్పడంతో కుటుంబీకులకు సమాచారం అందించగా సోమవారం ఆస్పత్రికి చేరుకున్నారు. చిన్నారి సాత్విక్ కుటుంబీకుల వద్దకు వెళ్లకుండా, గత వారం రోజులుగా అలవాటు పడిన సెక్యూరిటీ సిబ్బంది వద్దే ఉంటానని మారాం చేయడం గమనార్హం. మాధవికి ప్రాణాపాయం లేదని రెండ్రోజుల్లో డిశ్చార్జీ చేస్తామని వైద్యులు స్పష్టం చేశారు.

- కల్లుకు అలవాటు పడి అదృశ్యమైన గంగాధర్ ఆచూకీ కోసం చిలకలగూడ పోలీసులు గాలిస్తున్నారు. బంధువు అనురాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్ తెలిపారు. సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నామని గంగధర్ ఫొటోలను అన్ని ఠాణాలకు పంపినట్లు సీఐ తెలిపారు.

డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిని అరెస్ట్ చేయాలి

అడ్డగుట్ట: డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని సీపీఐ సికింద్రాబాద్ కన్వీనర్ కాపల్లి శ్రీనివాస్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. లైంగిక వేధింపులకు పాల్పడుతున్న డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ సింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ నడిబొడ్డున రెండు వారాలుగా నిరసన వ్యక్తం చేస్తున్న రెజ్లర్లను ఏమాత్రం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. అంతే కాకుండా వారిపై లాఠీచార్జి చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. న్యాయం కోసం రోజుల తరబడి ఢిల్లీ వీధుల్లో పోరాడుతున్న మహిళా రెజ్లర్లకు న్యాయం చేయకుండా వారి పోరాటాలను అణచివేసే చర్యలు ప్రభుత్వం చేపడుతుందని ఆరోపించారు. న్యాయం కోసం రోడ్డెక్కిన మహిళా రెజ్లర్లకు పౌర సమాజం, ప్రజా స్వామ్యవాదలు అండగా నిలబడాలని, ఎక్కడికక్కడ తమ నిరసనను తెలుపాలన్నారు.

ఆస్పత్రి ఏర్పాటుపై సీఎంతో మాట్లాడుతా

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్


అఖిలపక్ష నేతలతో మాట్లాడుతున్న పద్మారావు గౌడ్

లాలాపేట: చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో వడ్డెర బస్తీ కమాన్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 34వ రోజుకు చేరుకుంది. అయితే.. ఓయూలో ఈద్-మిలాప్ కార్యక్రమానికి హాజరైన డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌ను మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం నాయకులు కలిశారు. హాస్పిటల్ కోసం గత 34 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నామని బస్తీ వాసుల కోసం హాస్పిటల్ ఏర్పాటు చేయాలని కోరగా త్వరలో సీఎం కేసీఆర్‌ను కలిసి హాస్పిటల్ ఏర్పాటుపై మాట్లాడి మీకు శుభవార్త చెప్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలకుంట హరి, గండికోట విజయ్‌కుమార్, శ్రీనివాస్, కుమార్, నర్సింహా, ఆలకుంట లింగయ్య, ప్రశాంత్, బబ్లూ, శ్రీను, ఓర్సు శేఖర్, జగన్, కృష్ణ పాల్గొన్నారు.

గొడవ పడిన ఇద్దరికి జైలుశిక్ష

రసూల్‌పురా: ఆలయానికి సంబంధించిన విషయమై గొడవ పడిన ఇద్దరికి జైలు శిక్ష విధించిన ఘటన కార్ఖాన పీస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అవినాష్ వివరాల ప్రకారం..కార్ఖాన మహంకాళి ఆలయానికి సంబంధించి కమిటీ సభ్యుల మధ్య గతకొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం అమ్మవారికి అంబలి సమర్పించే విషయమై విజేందర్ (57), అశోక్ (62) మధ్య గొడవ జరిగి ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. పోలీసులకు సమాచారం అందడంతో న్యూసెన్స్ కేసు నమోదు చేసి సోమవారం సికింద్రాబాద్ పదమూడో మెట్రో పాలిటన్ ప్రత్యేక న్యాయమూర్తి ముందు హాజరు పర్చగా ఇద్దరికి తొమ్మిది రోజులు జైలు శిక్ష విధించారు.